APTEL/2008/28200

## పశుసంవర్ధక శాఖకు ఈడీ అధికారులు

హైదరాబాద్, జూన్ 14 : గొర్రెల పంపిణీ స్కామ్‌పై ఈడీ దూకుడు పెంచింది. ఇప్పటికే ఈ కేసులో ఆరుగురు అధికారులు అరెస్టు అయ్యారు. ఇప్పుడు ఈడీ జోక్యంతో ఇంకా ఎలాంటి పరిణామాలు జరుగుతాయో అన్న ఆసక్తి నెలకొంది. ఈడీ కేసు నమోదు చేసి 24 గంటలు కాకముందే తెలంగాణలోకి ఎంట్రీ ఇచ్చారు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు. గొర్రెల పంపిణీ స్కామ్‌లో కేంద్రంగా మారిన పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఇప్పటికే ఆ శాఖ అధికారులకు లేఖ రాసిన ఈడీ అధికారులు... పలు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగినట్టు తేల్చింది. అవినీతి నిరోధక శాఖను రంగప్రవేశంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.





# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## జీహెచ్ఎంసి పరిధిని పెంచవద్దు

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిని పెంచే ప్రతిపాదనను బీజేపీ పార్టీ వ్యతిరేకిస్తుందని, తద్వారా రంగారెడ్డి జిల్లా ఉనికి దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, బొక్క నర్సింహారెడ్డి. రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మల్లారెడ్డిలు అన్నారు. ఈ మేరకు హిమాయత్ నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 21 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల జీహెచ్ఎంసీ విలీనం చేయాలనీ చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిని పెంచాలనే ప్రభుత్వ ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల ప్రాబల్యం కొనసాగడానికి జిహెచ్ఎంసిలో మున్సిపాలిటీలను, కార్పొరేషన్లు విలీనం చేయడానికి అధికారులు పూనుకుంటున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ పరిధిని విస్తరిస్తే హైదరాబాద్ చుట్టు ఉన్న గిరి, మేడ్చెల్ జిల్లాలో అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు.

సంపుటి: 16 సంచిక : 43 కరీంనగర్ శనివారం, జూన్ 15, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

### నీట్ యూజీ అంశంపై సీబీఐ విచారణకు డిమాండ్

## కేంద్రం, ఎన్టీఏకి సుప్రీంకోర్టు నోటీసులు



న్యూ డిల్లీ జూన్ 14 : దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష నీట్ యూజీ 2024 పరీక్షల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో 1563 మంది విద్యార్థులకు అదనంగా గ్రేస్ మార్కులు వచ్చాయి. దీనిపై విద్యార్థి సంఘాలు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశాయి. నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాల్లో అవకతవకలపై సీబీఐచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాయి. ఈ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి సుప్రీం నోటీసులు జారీ చేసింది. వీటితోపాటు సీబీఐ, బీహార్ ప్రభుత్వానికి కూడా నోటీసులిచ్చింది. అనంతరం తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది. నీట్ పరీక్షకు సంబంధించి దాఖలైన ఇతర పెండింగ్ పిటిషన్లతో కలిపి దీన్ని విచారిస్తామని స్పష్టం చేసింది. అప్పటి లోపు వివరణాత్మక స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్టీయేకి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా జరిగిన విషయం తెలిసిందే. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. అయితే, 2019 నుంచి ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఏకంగా 67 మందికి 720కి 720 మార్కులు రావడం, టాపర్లుగా నిలవడంతో నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు మొదలయ్యాయి. ఇప్పటివరకు నీట్ యూజీలో ఒక్కసారి కూడా ముగ్గురికి మించి టాపర్లు లేరు. 2019, 2020లో ఒక్కొక్కరు చొప్పున టాపర్లుగా నిలిచారు. 2021లో ముగ్గురు, 2022లో ఒక్కరు, 2023లో ఇద్దరు టాప్ స్కోరు సాధించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కొనసాగుతున్న విచారణ

### కేసీఆర్, హరీష్ రావులకు నోటీసులు..?



హైదరాబాద్, జూన్ 14 : కాళేశ్వరం ప్రాజెక్టుపై బహిరంగ విచారణకు రెడీ అవుతోంది జస్టిస్ చంద్రఘోష్ కమిషన్. ఈ ఎపిసోడ్‌లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌కు నోటీసులు ఇవ్వబోతోందని టాక్. త్వరలో మరోసారి ఆకస్మిక పర్యటనలకు రెడీ అవుతోంది కమిషన్. నిన్న హైడ్రాలజీ, నిపుణుల కమిటీలను విచారించిన జస్టిస్ ఘోష్.. నేడు ఇంకొందరిని పిలిచింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ విచారణ వేగవంతంగా కొనసాగుతోంది. హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లను కమిషన్ విచారించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో తాము ఐడెంటీపై చేసిన అంశాలను వివరించిన రెండు కమిటీలు.. ఎక్కువ నీటిని నిల్వ చేయడం వల్లే సమస్య తలెత్తిందని చెప్పినట్టు తెలుస్తోంది. రెండు వారాల లోపు మధ్యంతర నివేదిక, సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను అందించాలని రెండు కమిటీల ఇంజినీర్లను కమిషన్ ఆదేశించింది. టెక్నికల్ అంశాలపై అఫిడవిట్ ఫైల్ చేయాలని నిపుణుల కమిటీలకు సూచించింది. అఫిడవిట్ల పరిశీలన తర్వాత బహిరంగ విచారణ చేసేందుకు జస్టిస్ పీసీ ఘోష్ సిద్ధమవుతున్నారు. ఇందులో సంబంధం ఉన్న వారికి నోటీసులు ఇచ్చేందుకు గ్రౌండ్ వర్క్ కూడా ప్రిపేర్ చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీష్‌కు నోటీసులు ఇచ్చే అవకాశాలున్నట్టు టాక్ వినిపిస్తోంది. మరోవైపు.. విజిలెన్స్ ఇచ్చిన మధ్యంతర నివేదిక సమర్పించాలని గతంలోనే కమిషన్ ఆదేశించినా.. అది ఇప్పటివరకు చేరలేదు. రిపోర్ట్ వెంటనే సమర్పించాలని మరోసారి ప్రభుత్వానికి, విజిలెన్స్ విభాగానికి లేఖ రాయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి జస్టిస్? పీసీ ఘోష్? ఆకస్మిక పర్యటనలకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. టెక్నికల్ అంశాల తర్వాత ఆర్థిక అంశాలపై కమిషన్? దృష్టి సారించనుంది కమిషన్. ఆనకట్ట నిర్మాణ అంచనాలు, రుణాలు, వడ్డీ రేట్లపై విచారణ చేయనుంది. విచారణలో భాగంగా ఇటీవల %ూ% అండ్ %ు%, నవయుగ, ఆఫ్కాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యాయి. ఆరోపణలపై కమిషన్ వివరణ కోరగా.. తమకు టైం బౌండ్ పెట్టారని నిర్మాణం కంపెనీలు చెప్తున్నాయి.. ప్రభుత్వం విధించిన సమయంలో ప్రాజెక్టు పూర్తిచేసి అందించామని అంటున్నాయి. ఇదే విషయం అఫిడవిట్ రూపంలో సమర్పించాలని కమిషన్ సూచించింది. అఫిడవిట్‌లో సమాచారంతో విచారణను తప్పుదోవ పట్టించాలని చూస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని అధికారులను హెచ్చరించింది కమిషన్. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై రిపోర్ట్ ఇచ్చేందుకు జూన్ 30న డెడ్ కావడంతో నిర్మాణ కంపెనీలు, అధికారులు, సంబంధిత వ్యక్తుల నుంచి అన్ని వివరాలు సేకరిస్తోంది కమిషన్. శుక్రవారం మరికొంతమంది అధికారులను, ఇతర వ్యక్తులను విచారించనుంది కమిషన్.

## అక్క చెల్లెమ్మలకు మహిళా శక్తి పథకం

## తెలంగాణ సర్కార్ సరికొత్త పథకం



రాష్ట్రంలోని అక్కాచెల్లెమ్మలకు తెలంగాణ ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా శక్తి పథకం కింద మరో సర్వీస్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో 'మహిళా శక్తి – క్యాంటీన్ సర్వీస్' ల ఏర్పాటుకు సీఎస్ శాంతి కుమారి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో 'మహిళా శక్తి – క్యాంటీన్ సర్వీస్ ' లను ఏర్పాటు చేస్తున్నట్టు సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్రంలో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని అక్కాచెల్లెమ్మలకు తెలంగాణ ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా శక్తి పథకం కింద మరో సర్వీస్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో 'మహిళా శక్తి క్యాంటీన్ సర్వీస్' ల ఏర్పాటుకు సీఎస్ శాంతి కుమారి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో 'మహిళా శక్తి క్యాంటీన్ సర్వీస్ ' లను ఏర్పాటు చేస్తున్నట్టు సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్రంలో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, బస్ స్టాండ్‌లు, పారిశ్రామిక ప్రాంతాలలో మహిళా సంఘాల నిర్వహణలో ప్రత్యేకంగా క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు సీఎస్. ఇప్పటికే, అన్న క్యాంటీన్ల పేరుతో కేరళలో, దీదీ కా రసోయ్ అనే పేరుతో బెంగాల్‌లో నడుస్తున్న క్యాంటీన్‌ల పనితీరుపై అధ్యయనం చేసినట్లు వివరించారు. రానున్న రెండేళ్లలో కనీసం 150 క్యాంటీన్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.


## ఈ శాఖలపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌పై కసరత్తు చేస్తోంది. జూన్ 18 నుంచి శాఖల వారీగా సన్నాహక భేటీలు నిర్వహిస్తోంది. తెలంగాణ పూర్తి స్థాయి బడ్జెట్‌పై ఆర్థికశాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఈనెల 18 నుంచి శాఖల వారీగా బడ్జెట్ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీని కోసం ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క.. ఆధ్వర్యంలో శాఖల వారీగా మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీలతో సమావేశాలు జరుగుతాయని తెలిపింది. ఈనెల 18న వ్యవసాయ, చేనేతశాఖల ప్రతిపాదనలపై చర్చించనున్నారు. జూన్ 21న రెవెన్యూ, గృహనిర్మాణం, ఐఅండ్ పీఆర్, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమం, వైద్య-ఆరోగ్య శాఖలతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొంది. జూన్ 22న సినిమాటోగ్రఫీ, ఐటీ, ఆర్అండ్‌బీ, పరిశ్రమల శాఖ పై చర్చించనున్నారు. జూన్ 26న నీటిపారుదల, పౌరసరఫరాలు, అటవీ, దేవాదాయశాఖలపై సమావేశం నిర్వహించనున్నారు. జూన్ 27న రవాణా, బీసీ సంక్షేమం, ఎక్సైజ్, పర్యాటకశాఖల ప్రతిపాదనలపై చర్చిస్తారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న శాఖలపై జూన్ 28 నుంచి జూలై 1 వరకు సమావేశాలు జరుగనున్నాయి. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆయాశాఖల పరిధిలోని పథకాల వ్యయ ప్రతిపాదనలను క్షుణ్ణంగా సమీక్షించాలని ఆర్థికశాఖ పేర్కొంది. ఆయాశాఖల పరిధిలోని పథకాల వ్యయానికి సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించి పద్దులను సిద్ధం చేయనున్నారు. ఇటీవలి ప్రభుత్వ ప్రకటనలను దృష్టిలో ఉంచుకొని కొత్త పథకాలకయ్యే ఖర్చు వివరాలను ప్రత్యేకంగా రూపొందించాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. జులై నెలాఖరులోగా పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ ఉభయసభల ఆమోదం పొందాల్సి ఉంది.

# కువైట్ మృతుల కథలు

## ప్రమాదంలో మొత్తం 50 మంది మృతి



హైదరాబాద్, జూన్ 14 : కువైట్ లోని మంగఫ్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మొత్తం 50 మంది మృతి చెందగా, వీరిలో 45 మంది భారతీయులు, ముగ్గురు ఫిలిప్పీన్స్ జాతీయులు ఉన్నట్లు కువైట్ అధికారులు ప్రకటించారు. మృతి చెందిన భారతీయుల్లో ముగ్గురు ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వాళ్లంతా కొద్దిరోజుల కిందటే అక్కడికి వెళ్లి ప్రాణాలు కోల్పోవడం బాధను కలిగించే విషయం. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఒక్కొక్కరిది ఒక్కో గాథ. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకిభద్రకు చెందిన తామడ లోకనాథం(31) ఆరేళ్లుగా ఎన్బిటిసి సంస్థలో రోలింగ్ ఆపరేటర్ హెల్పర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత తన క్యాంపునకు చేరుకొని ప్రయాణ బడలికతో నిద్రపోయాడు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో నిద్రలోనే మృత్యుఒడిలోకి జారుకున్నారు. నిబంధనల ప్రకారం ఆయన క్యాంపునకు తిరిగి రాగానే ఆ వివరాలను ఎంట్రీ చేయించుకోవాలి. అలా చేయకపోవడం వల్ల క్యాంపు లిస్టులో అతని పేరును చేర్చలేదు. దీంతో మరణ ధ్రువీకరణలో ఆలస్యం జరిగింది. లోకనాథం ఇటీవలే ఊర్లోని గ్రామదేవత సంబరాలు కోసం కువైట్ నుంచి వచ్చారు. ఎన్నికల ఫలితాలను చూసి అందరితో సరదాగా గడిపి మంగళవారం కువైట్ బయలుదేరారు. అర్ధరాత్రి దాటిన తర్వాత క్యాంపును చేరుకుని నిద్రలోనే తిరిగిరాని లోకాలు చేరుకున్నారు. లోకనాథం మృతితో జింకిభద్రలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమను ఆదుకుంటాడనుకున్న కొడుకు లేడని తెలుసుకుని లోకనాథం తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. మృతదేహాన్ని వెనక్కి రప్పించేలా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇదే క్యాంపులో మరో ఐదుగురు తెలుగువాళ్ళు ఆశ్రయం పొందారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అన్న వరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వర్ (45), పెరవలి మండలం కండవల్లికి చెందిన ముల్లేటి సత్యనారాయణ (45) చనిపోయినట్లు కువైట్ లోని భారత రాయబార కార్యాలయం గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించింది. వీరిద్దరూ హైవే స్టోర్ లో డెలివరీ బాయ్స్ గా పని చేస్తున్నారు. మీసాల ఈశ్వర్ పదేళ్లుగా కువైట్ లోని హైవే సూపర్ మార్కెట్లో సేల్స్ బాగా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవలే కుమార్తెకు వివాహం నిశ్చయమైనా విమానం టికెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో కువైట్ నుంచి రావడానికి మరో నాలుగు రోజులకు వాయిదా వేసుకున్నారు. నాలుగు రోజుల్లో వస్తాడనుకున్న ఈశ్వర్ విగతజీవిగా వస్తుండడంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరువుతున్నారు. ఇదే ప్రమాదంలో మృతి చెందిన బుల్లెట్ సత్యనారాయణ తన కుటుంబాన్ని పోషించుకునేందుకు పదేళ్లుగా కువైట్లో పని చేస్తున్నారు. ఈయనకు భార్య, చదువుకునే కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు. బుధవారం నాటి అగ్ని ప్రమాదంలో సత్యనారాయణ తీవ్ర గాయాల పాలయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత ఎంతో మంది తమ ప్రాణాలను దక్కించుకునేందుకు పరుగులు పెట్టారు. ఈ క్రమంలోనే చనిపోయారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం కొమ్మగూడెం గ్రామానికి చెందిన కే గంగయ్యతోపాటు తెలంగాణకు చెందిన మరో ఇద్దరు కూడా ప్రమాదం జరిగిన భవనంలోనే ఉన్నారు. తెల్లవారుజామున ప్రమాదం జరగగానే వీరు తప్పించుకునే ప్రయత్నం చేశారు.

## మల్లారెడ్డిపై మరో కేసు

హైదరాబాద్, జూన్ 14 : మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డికి పరిస్థితులు అనుకూలంగా లేవు. ఆయనపై వారానికో కబ్జా కేసు నమోదు అవుతోంది. తాజాగా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఆయనపై మరో కేసు నమోదయింది. తమకు ఉన్న 32గుంటల భూమి కబ్జా చేసి, అందులో తమ కట్టడాలను కూల్చివేశారని ఓ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు మల్లారెడ్డితో పాటు ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డిపైనా ఏడు సెక్షన్ల కింద కేసులు పెట్టారు. శేరి శ్రీనివాస్ రెడ్డి అనే సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌కు మేడ్చల్ జిల్లా సుచిత్ర పరిధిలోని సర్వే నెంబర్ 82లో భూమి ఉంది. ఆ భూమి తమదేనంటూ మల్లారెడ్డి కబ్జా చేశారు. ఈ భూ వివాదం కోర్టుకు వెళ్లింది. కోర్టు కేసులు, ఆదేశాలు ఉన్నప్పటికీ.. 32 గుంటలకుపైగా ఆక్రమించుకున్నారు. ఈ భూమి విషయంలో ఇటీవల మల్లారెడ్డి, ఆయన అల్లుడు..ఇతరులు వేసుకున్న ఫెన్సింగ్ తీసేసి హంగామా చేశారు. వివాదంపై అధికారులు సర్వే చేశారు. డాక్యుమెంట్ల ప్రకారం మల్లారెడ్డికి 29 గుంటల భూమి మాత్రమే ఉందని తేల్చారు. అధికారులు జూన్ 13న హైకోర్టుకు నివేదిక అందించారు. సర్వే రిపోర్ట్‌ను కోర్టు ద్వారా సైబరాబాద్ పోలీసులకు అందజేశారు. దీంతో మల్లారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు పోలీసులు. సుచిత్ర పరిధిలోని సర్వే నెంబర్ 82లో ఉన్న రెండున్నరెకరాల భూమి తమదేనని మల్లారెడ్డి అంటున్నారు. అయితే అందులో 1.11 ఎకరాలు తమదేనని, తలా 400 గజాలు కొన్నామని, కోర్టు తీర్పు తమకే అనుకూలంగా వచ్చిందని పదిహేను మంది వ్యక్తులు ఫెన్సింగ్ వేసుకున్నారు. ఈ ఫెన్సింగ్‌ను మల్లారెడ్డి తన అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డితో వచ్చి మే 19వ తేదీన తొలగించారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ భూ వివాదంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కూ ఉన్నారు.

# పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : సిసిఎల్‌ఏ కమీషనర్ నవీన్ మిట్టల్



పెద్దపల్లి, జూన్ -14: పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, మెదక్, సిద్దిపేట జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. సీసీఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసిల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పరిష్కరించాలని అన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు. ధరణి వెబ్ సైట్ సంబంధించి జిఎల్ ఎం, టిఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసిల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారి, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నా మని అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని సిసిఎల్ఏ కమీషనర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని, మార్కెట్ విలువ నమోదులో ఎక్కడా స్థానికంగా ఎటువంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. సీసీఎల్ఏ నుంచి జిల్లా కలెక్టర్లకు రిటర్న్ వచ్చిన దరఖాస్తులలో అధికంగా ఆర్.ఎస్.ఆర్ దరఖాస్తులు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు జత చేయని దరఖాస్తులు ఉంటాయని అన్నారు. ఆర్ఎస్ఆర్ దరఖాస్తులలో తప్పుడు ఎంట్రీ జరిగిందా ధ్రువీకరించి, తప్పుడు ఎంట్రీని తొలగించి , ఆర్ఎస్ఆర్ సవరణకు రిపోర్టుతో సహా దరఖాస్తులు పంపాలని కలెక్టర్లకు సీసీఎల్ ఏ కమీషనర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారుల,తహసిల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వచ్చే గురువారం నాటికి పరిష్కరిస్తామని అన్నారు.

# విస్తరణకు రెడీ... భారమంతా అధిష్టానంపైనే



**హైదరాబాద్, జూన్ :** తెలంగాణ మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండే అవకాశాలున్నాయి. ఎప్పుడైనా మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశముందని చెబుతున్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కసరత్తులు పూర్తి చేసినట్లు తెలిసింది. ఢిల్లీ పెద్దల నుంచి మంత్రివర్గ విస్తరణకు సంబంధించి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. తెలంగాణ మంత్రివర్గంలో ఇంకా ఆరు స్థానాలు ఖాళీగానే ఉంచారు. అనేక శాఖలను పలువురు మంత్రులు చూస్తున్నారు. ఇది వారికి కొంత ఇబ్బందిగా మారింది. దీంతో పాటు కొన్ని సామాజికవర్గాలకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో ఈసారి వారికి అవకాశమివ్వాలని నిర్ణయించారని తెలిసింది. ఇటీవల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరయిన రేవంత్ ఈ మేరకు విస్తరణకు సంబంధించిన హామీని పొందినట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా దగ్గరపడుతుండటంతో రేవంత్ రెడ్డి త్వరగానే విస్తరణకు రెడీ అవుతున్నారని తెలిసింది.తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కసరత్తు జరుగుతోంది. ఇదే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఆగస్టు 15వ తేదీలోపు పూర్తిస్థాయి మంత్రివర్గం ఉండాలని రేవంత్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిపి పన్నెండు మంది మాత్రమే కేబినెట్ లో ఉన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏర్పడిన తొలి మంత్రివర్గంలో పన్నెండు మందికే స్థానం దక్కింది. మరికొందరికి అవకాశం ఇవ్వాలని ఆలోచించినా లోక్‌సభ ఎన్నికల తర్వాత మిగిలిన స్థానాలను భర్తీ చేయాలన్న ఆలోచనలో హైకమాండ్ ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో అందరూ కలసి పనిచేసేందుకు కొన్ని ఖాళీలను కావాలని అలాగే ఉంచారు. మంత్రివర్గంపై ఎందరో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి గత ఎన్నికల్లో ఒక్కరూ కాంగ్రెస్ నుంచి గెలవలేదు. మొన్న కంటోన్మెంట్ లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గణేష్ విజయం సాధించారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తి కావడంతో విస్తరణ చేపట్టాలని ఆలోచిస్తున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో రెడ్డి సామాజికవర్గం నుంచి నలుగురు మంత్రులుండగా, ఎస్సీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఇద్దరు, ఎస్టీ, కమ్మ, వెలమ సామాజికవర్గాల నుంచి ఒక్కొక్కరు లెక్కన కేబినెట్ లో చోటు దక్కింది. అయితే ఈసారి విస్తరణలో మైనారిటీలకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. మైనారిటీకి చెందిన వారిని ఎమ్మెల్సీగా చేసి కేబినెట్ లో చోటు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. దీంతో పాటు ముదిరాజ్ వర్గానికి చెందిన వారికి కూడా ఈసారి కేబినెట్ లో ఛాన్స్ దక్కే అవకాశాలున్నాయి. అయితే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవి ఇచ్చే ఆలోచనలో మాత్రం కాంగ్రెస్ నాయకత్వం లేదు. అది పార్టీ క్యాడర్ లోకి తప్పుడు సంకేతాలు పంపుతుందని భావిస్తున్నారు. అందుకే పార్టీకి గత ఎన్నికల్లో పనిచేసిన వారికే కేబినెట్ లో చోట కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. ఈ జిల్లా నుంచి ఒకరికి అవకాశం ఉండనుంది. నిజామాబాద్ జిల్లా నుంచి కూడా ఈసారి కేబినెట్ లో ఒకరికి ఛాన్స్ ఉంటుందని చెబుతున్నారు. అయితే రెడ్డి సామాజికవర్గాల నుంచి కాకుండా ఇతర సామాజిక వర్గాల వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న యోచనలో రేవంత్ ఉన్నారు. పార్టీ కో?సం పనిచేసి త్యాగాలు చేసిన వారిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎవరిని నొప్పించకుండా కేబినెట్ కూర్పు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. అయితే కేబినెట్ విస్తరణ చేసినా రేవంత్ రెడ్డి ఆ నెపాన్ని హైకమాండ్ పైనే నెట్టే అవకాశముంది. తనకు ఏమాత్రం సంబంధం లేదని, హైకమాండ్ సూచన మేరకే తాను విస్తరణ చేశానని చెప్పే అవకాశాలు ఎక్కువ. అయితే ఎక్కువ అసంతృప్తులు చోటు చేసుకోకుండా, మంత్రి పదవి రాని వారికి తర్వాత జరిగే మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పిస్తామన్న హామీ కూడా గట్టిగా ఇవ్వాలన్న నిర్ణయంతో రేవంత్ ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద అతి త్వరలోనే రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని విస్తరించబోతున్నారన్న వార్త తెలిసిన వెంటనే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి : పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు




పెద్దపల్లి, జూన్ -14: ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, ప్రజలంతా తమ పిల్లలను నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కోరారు. శుక్రవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పెద్దపల్లిలోని అమర్ నగర్ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ లు పంపిణీ చేశారు. పాఠశాలకు విచ్చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యేకు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. పాఠశాలను ఆసాంతం పరిశీలించిన ఎమ్మెల్యే అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్మించిన రీడింగ్ కార్నర్ రూమ్ ను, తరగతి గదులలో ఏర్పాటు చేసిన ఐవిపి ప్యానెల్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ, జూన్ 6 నుంచి జూన్ 19 వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని మన పెద్దపల్లి జిల్లాలో విజయవంతం చేసేందుకు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి పిల్లవాడు పాఠశాలల్లో నమోదు అయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారని, గతంలో నిర్వీర్యమైన ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం 1100 కోట్ల ఖర్చుచేసి పునరుద్ధరించి, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని వసతులు విద్యార్థులకు కల్పించామని అన్నారు. ప్రస్తుతం మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో 150 మంది విద్యార్థులు చదువుతున్నారని, వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావాలని, అనవసరంగా ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు బడులకు పంపి డబ్బు వృధా చేసుకోవద్దని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పాఠశాలలో వచ్చే చిన్న, చిన్న సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని ఆ సమస్యల సత్వర పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. పాఠశాలలో ఉన్న గ్రంథాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గ్రంథాలయంలో మంచి పుస్తకాలు కొనుగోలు చేసి విద్యార్థుల కోసం అందించేందుకు పదివేల రూపాయలను సొంత నిధుల నుంచి విరాళం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలో కొత్తగా చేరిన పిల్లలచే అక్షరాభ్యాసం ఎమ్మెల్యే చేయించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రెడ్డి డి.మాధవి, మండల విద్యాశాఖ అధికారి సురేందర్, ప్రధానోపాధ్యాయులు మంజులత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్, పంచాయతీ సెక్రెటరీ, ఎంపిఓ ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిద్రలో విద్యశాఖ అధికారులు



**వరంగల్, జూన్ :** విద్యా శాఖలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చినా, అధికారులు మాత్రం పాత ప్రభుత్వమనే భ్రమల్లోనే ఉన్నారు. మొద్దు నిద్ర వీడడంలేదు. దాని ఫలితమే తెలంగాణలో పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలను వెనక్కి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలేం జరిగింది?తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. తెలుగు పాఠ్య పుస్తకం ముందుమాటలో ముఖ్యమంత్రిగా కేసీఆర్, విద్యాశాఖ మంత్రిగా సబిత ఇంద్రారెడ్డి పేర్లు యధాతధంగా ఉంచేశారు. ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ అయ్యింది. దీనికి బాధ్యులు ఎవరన్నదానిపై విచారణ మొదలైంది.పాఠ్య పుస్తకాలను కనీసం చూడకుండా పంపిణీ చేయడంపై విద్యాశాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ లో కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటింది. అయినా అధికారులు ముందుమాట మార్చకపోవడాన్ని చాలా మంది తప్పుబట్టారు. పుస్తకాలు చూసుకుని విద్యార్థులు సంతోషంగా ఉన్న సమయంలోనే ప్రభుత్వం షాకింగ్ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలన్నీ వాపస్ తీసుకోవాలని విద్యాశాఖను ఆదేశించింది. దీంతో ఉపాధ్యాయులు పంపిణీ చేసి పుస్తకాలన్నీ తిరిగి తీసుకునే పనిలో ఉన్నారు.విద్యాశాఖ పుస్తకాలు వాసస్ తీసుకోవడానికి ప్రధాన కారణం.. పుస్తకాల్లో ముందు మాట మార్చకపోవడమే అని తెలుస్తోంది. గత బీఆర్ఎస్ సర్కార్.. ముందు మాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి పేర్లతో ముద్రించి పంపిణీ చేసింది. ఈసారి పుస్తకాలు ముద్రించిన తెలుగు అకాడమీ.. ముందు మాట మార్చలేదు. దీంతో అన్ని పుస్తకాల్లో పాత ముందుమాటనే ముద్రించింది. ఇందులో పొరపాట్లు ఉన్నాయి. పొరపాటును గుర్తించిన ఉపాధ్యాయులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.మరోవైపు పుస్తకాలపై మాజీ సీఎం కేసీఆర్ ఫొటోతోపాటు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, సంజాలకులు జగదీశ్వర్ పేర్లు కూడా ఉన్నాయి. దీంతో అలర్ట్ అయిన విద్యాశాఖ అన్ని పాఠ్య పుస్తకాలను వాపస్ తీసుకోవాలని ఆదేశించింది.పాఠ్య పుస్తకాలు వాపస్ తీసుకున్న విద్యా శాఖ, కొత్తవి ఎప్పుడు పంపిణీ చేస్తారు.. పుస్తకాల్లో ముందు మాట మార్చడానికి ఎంత సమయం పడుతుంది.. అప్పటి వరకు పాఠాలు ఎలా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకుంటామనే విషయంలో ప్రభుత్వం నుంచిగానీ, విద్యా శాఖ నుంచిగానీ ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రమంలో పాఠ్య పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. బుధవారం నుంచి పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలను ఉపాధ్యాయులు వెనక్కి తీసుకున్నారు. విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంపై ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


# 15 రోజుల్లో టాస్క్ భవనం ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పెద్దపల్లి, జూన్ -14: టాస్క్ భవనం ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని, 15 రోజుల్లో ప్రతిపాదించిన పనులు పూర్తిచేసి ప్రారంభానికి సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణం లోని టాస్క్ భవనాన్ని ఆకస్మికంగా సందర్శించి టాస్క్ భవనం ఆధునీకరణ పనులను తనిఖీ చేశారు. పెద్దపల్లి టాస్క్ భవన ఆధునీకరణ పనులను ఆసాంతం పరిశీలించిన కలెక్టర్, పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, జూలై 15 నుంచి టాస్క్ భవనంలో మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యేలా జూన్ 30 లోగా పనులు పూర్తి చేయాలనీ తెలిపారు. కార్పొరేట్ లుక్ వచ్చే విధంగా టాస్క్ భవనం ఆధునీకరణ ఉండాలని, టాస్క్ భవనంలో వినియోగించే విద్యుత్ లైట్లు మోడ్రన్ లుక్ తో ఉండే విధంగా చూసుకోవాలని, మంచి స్టాండెర్డ్ కంపెనీ లైట్లు వినియోగించాలని కలెక్టర్ సూచించారు. టాస్క్ భవనంలో విద్యార్థుల కోసం మోడర్న్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లా టాస్క్ మేనేజర్ గంగా ప్రసాద్, పి.ఆర్. - డి.ఈ. శంకరయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇక 4 వైపుల నుంచి నారాయణుడి దర్శనం

**పూరీ, జూన్ :** ఇక నలు దిక్కుల వ్యాపించిన నారాయణుడిని, నాలుగు ద్వారాల నుంచి వచ్చి భక్తితో నమస్కరించుకోవచ్చు. ఒడిశాలో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ.. తన ఎన్నికల హామీని నెరవేర్చుకుంది. పూరీ జగన్నాథ స్వామి ఆలయంలోని నాలుగు ద్వారాల నుంచి భక్తులను అనుమతిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీజేపీ సర్కార్, ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. పూరీ జగన్నాథ ఆలయంలో 4 ప్రవేశ ద్వారాలు ఉన్నాయి. కొవిడ్ టైమ్‌లో అప్పటి ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, వీటిలో మూడింటిని మూసివేశారు. వాటిని అప్పటినుంచి తెరవలేదు. మూతపడ్డ ప్రవేశ ద్వారాలు.. ఎన్నికల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఎట్టకేలకు ఈ ద్వారాలను బీజేపీ సర్కార్ ఓపెన్ చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒడిశా కొత్త ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఆయన మంత్రి వర్గ సహచరులు పూరీ జగన్నాథుడిని దర్శించుకున్నారు. ఇక పూరీ జగన్నాథ ఆలయంలో అభివృద్ధి పనుల కోసం 500 కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించనుంది ఒడిశా నయా సర్కార్.పూరీలోని జగన్నాథుడి ఆలయానికి నాలుగు దిక్కుల్లో నాలుగు ప్రవేశ ద్వారాలు ఉన్నాయి. తూర్పు దిక్కున ఉండే ద్వారాన్ని? సింహ ద్వారం అంటారు. దీనికి రెండు వైపులా సింహాల విగ్రహాలు ఉంటాయి. ఆలయంలో ప్రవేశించడానికి ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం కూడా ఇదే. ఇది గ్రాండ్ రోడ్డుకు ఎదురుగా ఉంటుంది. సింహాన్ని మోక్షానికి ప్రతీకగా చెబుతారు. ఈ ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించేవారికి మోక్ష ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇదే ద్వారంలో కాశీ విశ్వనాథుడు, గౌడీయ నరసింహ, భాగ్య హనుమాన్ దేవతల విగ్రహాలు కూడా ఇక్కడే కొలువు దీరి ఉంటాయి. ఇక పశ్చిమంలో ఉండే ద్వారాన్ని వ్యాఘ్ర ద్వారం అంటారు. వ్యాఘ్రం అంటే పెద్దపులి. ఈ ద్వారానికి రెండువైపులా పులుల ప్రతిమలు ఉంటాయి. పులిని ధర్మానికి ప్రతీకగా చెబుతారు.ఇక ఉత్తర భాగంలో నుంచి ఆలయంలోకి ప్రవేశించే ద్వారాన్ని?.హస్తి ద్వారం అంటారు. దీనికి ఇరువైపులా ఏనుగు విగ్రహాలు కొలువుదీరి ఉంటాయి.



# భద్రకాళి ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది పూజలు

వరంగల్ శుక్రవారం శుక్రవారం రోజున ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రకాళి ఆలయంలోప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి పూజ నిర్వహించారు అనంతరం పేద పండితులు ఆశీర్వాదం చేసి అమ్మవారి ప్రసాదం అందజేశారు

# అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి



సిరిసిల్ల, జూన్ 14 : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ పిలుపునిచ్చారు. జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జడ్పీ చైర్ పర్సన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలని, వారికి సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీ.ఎఫ్.ఓ బాలమణి, జడ్పీ సీఈవో ఉమా రాణి ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.